# 16

# పవిత్ర గుడారమును గూర్చిన ఉపమానము

## (9:1-14)

హెబ్రీయులకు 8వ అధ్యాయములో "శ్రేష్ఠమైన నిబంధన" గురించి ప్రాముఖ్యంగా చెప్పబడింది (చూడు 6 వ.). యేసునకు పవిత్రమైన గుడారము ఉందని కూడ ఈ అధ్యాయం చెప్తుంది. "మనుష్యుడు గాక, ప్రభువే స్థాపించిన నిజమైన గుడారము ..." (2 వ.; చూడు 5 వ.). 9వ అధ్యాయం మొదటి భాగంలో, గ్రంథకర్త యేసు యొక్క గొప్ప గుడారము గురించి మాట్లాడుతున్నాడు: అధ్యాయంలోని మొదటి వచనం అంశాలను కలిపి చెప్తుంది: మొదటి నిబంధన ప్రత్యక్ష గుడారము గురించి మరియు అందులో జరిగే ఆరాధనా కార్యక్రమాలను గురించి చెప్తుంది.

ప్రత్యక్ష గుడారము అంశము ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. దీని గురించిన అన్ని విషయాలను గురించి చర్చించేంత సమయం మనకు లేదు – అలాగే హెబ్రీ గ్రంథకర్త కూడ దీన్ని పూర్తిగా వివరించడం లేదు (చూడు 9:5). మన విధానం, 9:9లో కనబడుతుంది. పాత నిబంధన ప్రత్యక్ష గుడారము "ప్రస్తుత కాలమునకు *ఉపమానముగానున్నది*" (నొక్క చెప్పింది నాది). "ఉపమానం" *parabole* అనే గ్రీకు పదం నుండి వచ్చింది. దీనికి "ఉపమానం" అని అర్థము.[1] *Parabole* అంటే "ప్రక్కన ఉంచడం" అని అర్థం: "పోల్చుటకు 'ఒక దానిని మరోదాని ప్రక్కన' ఉంచి చూడడం" అన్న అర్థమును ఇది ఇస్తుంది.[2] ఇంకా చెప్పాలంటే ఈ లోకపు గుడారమును పరలోకపు గుడారము పక్కన పెట్టి రెండింటిని పోల్చుతున్నాడు గ్రంథకర్త.

### నమూనా

ఈ పోలికను గుర్తించుటకు మొదటిగా ఈ లోకపు గుడారమును చూద్దాము. 8వ అధ్యాయం ప్రత్యక్ష గుడారపు "నమూనాను" గురించి మరియు "చూపబడిన మాదిరి చొప్పున" (5 వ.) చేసే ప్రాధాన్యత గురించి ఇది చెప్తుంది.

#### ప్రత్యక్ష గుడారము యొక్క వివరాలు (9:1-5)[3]

ప్రత్యక్ష గుడారమును గురించిన అనేక వివరాలు మొదటి ఐదు వచనాలలో ఇయ్యబడ్డాయి. ఈ క్రింద యివ్వబడినవి ప్రత్యక్ష గుడారములో ఉన్నాయి:

- పరిశుద్ధ స్థలం (2 వ.).[4]
- బంగారు దీపస్తంభము (2 వ.).
- పరిశుద్ధ రొట్టె ఉంచబడిన బల్ల (2 వ.).
- రెండవ తెర (పరిశుద్ధ స్థలం మరియు అతి పరిశుద్ధ స్థలమునకు మధ్యగల తెర) (3 వ.).
- అతి పరిశుద్ధ స్థలం (3 వ.).[5]

- ధూపార్తి "సువర్ణ ధూపార్తి" (4 వ.) అని కూడా పిలువబడుతుంది. పరిశుద్ధ స్థలంలో తెరముందు దీన్ని ఉంచేవారు; దీనినుండి వచ్చిన ధూమం అతి పరిశుద్ధ స్థలంలోకి వెళ్తుంది. కాబట్టి గ్రంథకర్త దీనిని అతి పరిశుద్ధ స్థలమునకు చెందినదిగా వివరిస్తున్నాడు.
- నిబంధన మందసము మరియు అందలి వస్తువులు (4 వ.).
- కరుణా పీఠము (నిబంధన మందసము పైగా ఇది ఉంటుంది) (5 వ.).

8వ అధ్యాయమును గుర్తు చేస్తూ ఇతర వివరాలు కూడ ఇయ్యబడ్డాయి. ఈ రెండు వస్తువులు గుడారము వెలుపటనుంటాయి.

- ఇత్తడి బలిపీఠం (ఇత్తడితో చేయబడిన పెద్ద బలిపీఠం) ఇది గుడారము ఎదురుగా ఉంటుంది. ఇక్కడే బలులు అర్పించబడతాయి. ఇక్కడ జంతువుల రక్తం చిందింపబడుతుంది. (దీని గురించిన వివరణ 7, 9, 11–13 వచనాలలో కనబడుతుంది.)
- ఇత్తడి బలిపీఠం, మరియు ప్రత్యక్ష గుడారము మధ్యలో గంగాళము ఉంటుంది. ఇక్కడ ఆచార బద్ద "శుద్ధతలు" జరుగుతాయి (చూడు 10 వ.).

**ఆచారముల వివరాలు (9:6–10)**

మొదటిగా, పరిశుద్ధస్థలంలో యాజకులు చేసే పరిచర్య గురించి పేర్కొనబడింది (6 వ.).[6] గ్రంథకర్త వాదన ప్రకారం ఇదేమంత ప్రాముఖ్యమైన విషయం కాదు. ఈ వ్యవహారం ప్రకృతిపరంగా తాత్కాలికమైనదని అతడు గుర్తిస్తున్నాడు (8 వ.). అయితే అతడు ఎక్కువగా ప్రధానయాజకుడు అతిపరిశుద్ధ స్థలంలోకి ప్రవేశించే ప్రాయశ్చిత్త దినము గురించే మాట్లాడుతున్నాడు (7వ వ.; చూడు 25 వ.).[7]

## ఉపమానము

**ఇతరత్రా సారూప్యతలు**

ఇహలోకపు మరియు పరలోకపు అలాగే శరీరికపు మరియు ఆత్మీయపు విషయాలను పోల్చుచుండగా వీటిని గమనించండి. ఇహలోకపు గుడారము మరియు క్రైస్తవ్యమును గురించి, వాటి మధ్యనున్న సారూప్యతలను గురించి ఎన్నో ఏళ్ళుగా ప్రసంగీకులు ప్రసంగాలు చేశారు.

- పరిశుద్ధ స్థలంలోకి ప్రవేశించక ముందు యాజకులు గంగాళములో కడుగుకునేవారు. అలాగే మనం బాప్తిస్మం పొందినప్పుడు, "నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమవుతాము" (10:22).
- పరిశుద్ధ స్థలంలో వెలుగుకు సువర్ణ దీపస్తంభమును ఉంచేవారు. అలాగే మన ఆత్మీయ వెలుగుకు దేవుని వాక్యం మూలమై ఉండాలి (4:12; చూడు కీర్తన 119:105).

- అతిపరిశుద్ధస్థలంలో సువాసన ధూమం లేచినట్లే, మన ప్రార్థనలు పరలోకమునకు వెళ్తాయి (చూడు ప్రకటన 5:8; 8:3, 4).

**ప్రధాన ఉద్దేశం**

అయితే, పాత నిబంధన ప్రత్యక్ష గుడారము మరియు ఇప్పటి క్రైస్తవ్యపు అంశాలకు మధ్య సారుప్యతలను పోల్చడం గ్రంథకర్త ఉద్దేశం కాదు. ఎప్పటిలాగే, యేసును పైకెత్తి ఆయన శ్రేష్ఠతను చూపించడం గ్రంథకర్త ఉద్దేశం. మన ప్రధాన యాజకుడుగా యేసు ...

- "చేతులతో చేయబడిన గుడారము" గాక "పరలోక గుడారములోనే" ప్రవేశించాడు (11 వ.; 24 వ.).
- ఎద్దుల గొఱ్ఱెల రక్తమును గాక తన స్వరక్తమునే అర్పించాడు (12 వ.).
- ఆయన పాపముల నిమిత్తం గాక, మన పాపముల నిమిత్తం బలిని అర్పించాడు (చూడు 7, 14 వచనాలు; 4:15; 7:27).
- "సంవత్సరానికొక" బలి గాక (7 వ.), "ఒక్కసారే" శాశ్వత బలి అర్పించాడు (12 వ.) - అది "అందరి" నిమిత్తమైనది (చూడు 25-28 వచనాలు; 9:12; 10:10)!

**విషయము**

ఇహ లోకపు ప్రత్యక్ష గుడారపు సేవా నియమములను మరియు పరలోకపు గుడారపు సేవా నియమములను ప్రక్కన ఉంచి రెండింటికి గల భేదములను గ్రంథకర్త చూపిస్తున్నాడు. అతని విషయం ఏమిటి?

**మన గుడారము శ్రేష్ఠమైనది.**

మన వాక్య భాగంనుండి ఎన్నో పాఠములను నేర్చుకోవచ్చు. ఒకటి, మన గుడారము శ్రేష్ఠమైనది. అసలైన గుడారము మహిమాయుక్తమైనది. ఇహలోకపు గుడారములోనున్న సామగ్రి బంగారముతో చేయబడినది లేదా బంగారు పూత పూయబడినది. అలాగాక మన గుడారము ఎక్కువ మహిమగలది. ఇది పరలోకములో ఉంది!

**మన అర్పణ శ్రేష్ఠమైనది.**

మన అర్పణ శ్రేష్ఠమైనది అని మనం ఎరుగవలెనన్నది గ్రంథకర్త అభిలాష.

- జంతు బలులు అన్నవి పాత నిబంధనలో ఒక భాగము కాగా (10 వ.), క్రొత్త నిబంధన విమోచనలో మన అర్పణ ప్రధానమైనది (12 వ.).
- జంతు బలులు శరీరమునకు సంబంధించినవై యుండగా (13 వ.), మన బలి పాపములను క్షమించి మనస్సాక్షిని పవిత్రపరచుచున్నది (14 వ.).
- జంతు బలులు తాత్కాలిక శుద్ధతను ఇస్తుండగా, మన బలి నిత్య విమోచనను ఇస్తుంది (12 వ.).
- జంతు బలులు కొందరికే (యూదులకు) మాత్రమే అయి ఉండగా మన బలి

(28 వ.) “సర్వమానవాళికి” (2 కొరింథీయులకు 5:15).

**మన పరిచర్య శ్రేష్ఠమైనదిగా ఉండాలి.**

అవును ఇది నిజం, దేవునికి మనం చేసే పరిచర్య శ్రేష్ఠమైనదిగా ఉండాలి. 14వ వచనంలోని ఈ మాటలను మర్చిపోకండి: “క్రీస్తు యొక్క రక్తము ... *జీవముగల దేవుని సేవించుటకు* మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును” (నొక్కి చెప్పింది నాది). మనం రక్షించబడ్డాము కాబట్టి మనం పరిచర్య చేయాలి. తరువాత అధ్యాయంలో (19వ వ. నుండి) గ్రంథకర్త యొక్క సుధీర్ఘ “ప్రోత్సాహకర మాటలు” ప్రారంభమవుతాయి.

---

**ఉపదేశకులకు సూచనలు**

గ్రంథకర్త తన ఉదాహరణకు ఆలయమును గాక ప్రత్యక్ష గుడారమును ఎన్నుకొనుటకు ఒక కారణం ఉంది. ప్రత్యక్ష గుడారము అనేది మార్చగలిగేది. ఆలయం మార్చలేనిది, స్థిరకట్టడం. ప్రత్యక్ష గుడారపు సేవ, దాని గురించిన వివరాలను తెలుసుకోండి (నిర్గమకాండము 35–40).

---

సూచనలు

[1]NIVలో ఇది “ఉదాహరణగా” J. B. Phillips అనువాదంలో ఇది “దృశ్యముగా” అనువదించబడింది. [2]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* [Nashville: Thomas Nelson Publishers, 1985], 457. [3]ప్రత్యక్ష గుడారము బొమ్మను చూడండి. [4]6వ వచనంలో పరిశుద్ధ స్థలం “మొదటి గుడారము” [వెలుపటి] అని పిలువబడింది. [5]7వ వచనంలో అతి పరిశుద్ధ స్థలం “రెండవ గుడారముగా” పేర్కొనబడింది. [6]పరిశుద్ధస్థలంలోని ప్రతి వస్తువులో యాజకులు ఏం చేసేవారన్న విషయాన్ని మీరు వివరించవచ్చు. [7]ఆ దినమును ఏం జరుగుతుందో చెప్పండి “సంవత్సరానికి ఒక్కసారి” అంటే “సంవత్సరంలో ఒకరోజు” ప్రధాన యాజకుడు ఆ దినమున దాదాపు మూడుసార్లు అతి పరిశుద్ధ స్థలంలోకి వెళ్ళేవాడు.

## ప్రత్యక్ష గుడారములో ఉపయోగించిన వస్తువులు

